రైతు నోట మాటలేదు

- పతనమైన టమాటా ధర
- మార్కెట్‌లో కిలో రూ.4కే అమ్మకాలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- స్పందించని కూటమి ప్రభుత్వం



మార్కెట్‌లో అమ్మకాలు జరగక ఉన్న టమాటా



ధరలు లేక పొలంలో వదిలేసిన టమాటా పంట

గొలుగొండ: టమాటా ధర అమాంతంగా పడిపోయింది. మార్కెట్లో కిలో రూ.4 లోపే పలుకుతోంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కష్టపడి పంట పండిస్తే కనీసం ధర లేక అప్పులు పాల వుతున్నారు. నెల రోజులు నుంచి ధరలు రోజు రోజుకి పతనం కావడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌కు తీసుకువెళితే కనీసం కొనేవారు లేక ఉసూరుమంటున్నారు.

మార్కెట్‌లో కొనేవారు కరువు

మండలంలో జోగుంపేట, గొలుగొండ, చిన్నయ్య పాలెం, కరక, పప్పుశెట్టిపాలెం, ఏఎల్‌పురం తదితర ప్రాంతాల్లో 600 ఎకరాల్లో సాగులో ఉంది. ఈ నెలలో ఒకేసారి టమాటా పంట చేతికంది రావడంతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోయింది. ఇక్కడ పండిన పంటను ఏఎల్‌పురం, నర్సీపట్నం మార్కెట్ల్లో రైతులు తీసుకువెళితే కనీసం కొనేవారు కరువవుతున్నారు. 30 కేజీల టమాటా ట్రే(బుట్ట) రూ.80కు అమ్మకాలు జరుగుతున్నాయి. అదీ మధ్యాహ్నం వరకు ఎండలో రైతులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎగుమతులు లేకపోవడం వల్లే..

గతంలో పండిన టమాటా పంట ఒడిశా, విజయవాడ, రాజమండ్రి, విశాఖ ప్రాంతాలకు ఎగుమతులు అయ్యేవి. పండించిన పంటను వ్యాపారులు కొనుగోలు చేసి వ్యాన్లు, లారీలపై రవాణా చేసేవారు. ఈ ఏడాడి ఆ పరిస్థితి లేదు. పంట అన్ని ప్రాంతాల్లో ఒకేసారి రావడంతో ఇక్కడికి వ్యాపారులు రాలేదు. దీని వల్ల పండిన పంట స్థానికంగా అమ్ముకుని నష్టపోవాల్సి వస్తోంది.

వేలాది రూపాయల పెట్టుబడులు

టమాటా సాగుకు పెట్టింది పేరు గొలుగొండ మండలం. అక్కడ అనుకూలమైన నేలలు, వ్యవసాయ మోటార్లు అధికంగా ఉండటంతో ఏటా విస్తారంగా సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం ఇతర ప్రాంతాల్లో సైతం వేయడం వల్లే ఎక్కువగా టమాటా దిగుబడులు పెరిగాయి. ఎకరాలో టమాటా సాగు పూర్తి స్థాయిలో చేయాలంటే రూ.60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఇప్పుడున్న ధరలు ప్రకారం ఎకరాకు రూ.15 వేలు రావడం కష్టతరంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు 70 శాతం టమాటా పంట కోయగా, మరో 30 శాతం మంట మార్చిలో కోతకు సిద్ధంగా ఉంది.

తీవ్రంగా నష్టపోయాం



ఈ ఏడాది టమాటా సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. రెండున్నర ఎకరాల్లో సాగు చేసి లక్షా 50 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టాం. ఇప్పటికి రూ.20 వేలు మాత్రమే వచ్చాయి. మార్కెట్‌లో టమాటాను కొనేవారు కరువయ్యారు. దీని వల్ల తీవ్రంగా నష్టపోవలసి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.నూకరాజు రైతు గొలుగొండ

క్లుప్తంగా

గ్రామాల్లో ఘనంగా ఒడ్డు పండగలు



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయం వద్ద ఆదివారం ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన పుట్టా కొండలరావు కుటుంబ సభ్యులు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సాగరం, ఘాట్‌రోడ్డు కాటా ఆవరణలో మోదమాంబకు ఒడ్డు పండగలు చేశారు.

ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నాతవరం: గ్రామాల్లో ఆలయాలు నిర్మించడం వల్ల ప్రజల్లో మరింత భక్తిభావం పెరుగుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మండలంలో ఎ.పి.పురం పంచాయతీలో నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఆయన విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం వైద్యుడు పి.వి.రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల: విజయనగరం జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గ సమావేశం అరకులో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనాథు వెంకట మాధవ్, ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీను, కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం గుప్తా, కోశాధికారి పి.సంతోష్‌కుమార్, పీఆర్వో పుట్టా మోహన్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సంఘం పురోభివృద్ధి గురించి ఈ సందర్భంగా చర్చించారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



సరుగుడు జలపాతం వద్ద సందడి

నాతవరం: మండలంలో సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడేందుకు ఆసక్తి చూపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

పంచలోహ విగ్రహాల ప్రతిష్ట



శివపార్వతుల ఉత్సవ పంచలోహ విగ్రహాలు

రోలుగుంట: మండలంలోని జానకిరాంపురం శివాలయంలో శివపార్వతుల ఉత్సవ పంచలోహ విగ్రహాలను ఆదివారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయానికి పంచలోహ విగ్రహాలను సమకూర్చిన దాతకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కండక్టర్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

అనకాపల్లి: ఆర్టీసీ అనకాపల్లి డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ ఎస్.ఎస్.నారాయణ సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ కోరారు. స్థానిక డిపో గ్యారేజీ గేటు వద్ద ఆదివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



వెన్నలపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయం



కమిటీ నిర్వాహకుడు గణేష్‌కు నగదు అందజేస్తున్న వెంకటరమణ

నాతవరం: మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా రామాలయంలో వేదపండితులతో ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా బంధువులు, ఆడపడుచులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో కదిలిరావడంతో రామాలయం ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. విగ్రహ ప్రతిష్ట పూర్తయ్యాక రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళల భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం

రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ సర్పంచ్ నందిపల్లి వెంకటలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. రామాలయం కమిటీ నిర్వాహకుడు లాలం గణేష్‌కు నగదు అందజేశారు. తాండవ ప్రాజెక్టు చైర్మన్ కె.సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సింగపల్లి సన్యాసిదేముడు పాల్గొన్నారు.

వారాడలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



చెత్త సేకరణపై ప్రజలకు సూచనలు చేస్తున్న రమణి, సరోజిని

కె.కోటపాడు: రోజూ ఇంటి వద్దకు వచ్చే క్లాప్‌మిత్ర, పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి రమణి, పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని తెలిపారు. ఆదివారం ఉదయం వారాడలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను ఏ విధంగా గుర్తించి వేరు చేయాలో పంచాయతీ కార్యదర్శి ప్రజలకు వివరించారు. రోజూ పారిశుధ్య సిబ్బంది ప్రధాన వీధుల్లో చెత్తాచెదారాలను తొలగిస్తారన్నారు. తద్వారా గ్రామం పరిశుభ్రతతోపాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల ముస్తాబు



పెద్దేరు నదిలో జంపెన వద్ద ఉత్తరాయణం స్నానాల ఘట్టం



మాడుగులలో వెలసిన ఉబ్బలింగేశ్వరాలయం



మాడుగులలో కృష్ణ భూపాలేశ్వరాలయం



వీరవిల్లి అగ్రహారంలో ముస్తాబు చేస్తున్న శివాలయం

మాడుగుల/మాడుగుల రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు సర్వం సిద్ధమవుతున్నాయి. ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు స్థానిక ఉబ్బలింగేశ్వర, శ్రీకృష్ణ భూపాలేశ్వర, ఉమా భీమలింగేశ్వర, జంపెనలో వెలసిన గుప్తలింగేశ్వరాలయం, జలంపల్లిలో భీమ లింగేశ్వరాలయాలను ముస్తాబు చేస్తున్నారు. జంపెన వద్ద పెద్దేరులో ఉత్తరాయణం స్నానాలకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ రాత్రి స్నానాలు చేసేవారికి లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. దాతలు సహాయంతో పలు ఆలయాల వద్ద భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేయనున్నారు.

నేటి నుంచి వీరవల్లి అగ్రహారంలో

వీరవల్లి అగ్రహారం ఉమాభీమలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు వచ్చే నెల ఒకటో తేది వరకు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

బుచ్చింపేటలో..

రోలుగుంట: శివరాత్రుల ఉత్సవాలకు బుచ్చింపేటలో శివపార్వతులను సిద్ధం చేశారు. ఇక్కడ కోలాటం, చిటికెల భజనలు పోటీలు నిర్వహించనున్నారు. 26న మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, రాత్రికి సాంఘిక నాటకం ప్రదర్శించనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 18 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఉత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



ముగ్గుల పోటీల్లో మహిళలు



ఉత్సవాలకు సిద్ధమైన శివపార్వతులు

వైభవంగా ఇత్తడి మకరతోరణాల అలంకరణ

మాడుగుల రూరల్: కె.జె.పురం ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శివునికి, పార్వతీదేవి, వినాయకుడికి 37 కిలోలున్నర ఇత్తడితో తయారు చేసిన మకరతోరణాలను ఆదివారం అలంకరించారు. గ్రామానికి చెందిన పెంటకోట సూరిబాబు మాస్టారు, యల్లపు పెంటయ్య, కోట్యాడ ఉదయ భాస్కర్, మద్దాల జగ్గారావు, కోయిలాడ సుబ్బలక్ష్మి, బొడ్డేడ రామారావు కుటుంబ సభ్యులు వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో గౌరీ పరమేశ్వర భజన సేన సభ్యులు, భక్తులు, ప్రధాన అర్చకుడు హేమాదిభట్ల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



శివునికి తొడిగిన మకరతోరణం



ఇత్తడితో తయారు చేసిన మకరతోరణాలు

వేచలంలో ఆధ్యాత్మిక శోభ

వైభవంగా రామాలయ విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని వేచలంలో సీతారామ సహిత విఘ్నేశ్వర, లక్ష్మీదేవి ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళల కోలాటం, భజనా కార్యక్రమాలు, జై శ్రీరామ్ నినాదాలతో వేచలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, పార్టీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితనాయుడు, సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎం. అలమండ సర్పంచ్ దాడి జగన్, ఆర్.వి.కె.నాయుడు, వేచలపు చిన్నంనాయుడు, వేచలపు కృష్ణ, బత్తి నాయుడు, బండారు ప్రసాదరావు, కె.ఎస్. అప్పలనాయుడు తదితరులు దర్శించుకున్నారు. రాత్రికి ఏర్పాటు చేసిన రామాంజనేయ, గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశాలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

మాడుగుల: మండలంలో డి. గొటివాడ పంచాయతీ శివారు గొల్లలపాలెంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎడ్లబళ్లతోపాటు గుర్రం పరుగు పందేలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పిడతలు, ముగ్గులు పోటీలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, సర్పంచ్ గోకాడ అర్జునరావు, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాథు సూర్యకాంతం, జగన్నాథరావు, నాయకులు గోకాడ అప్పలనాయుడు, ఆడారి కన్నారావు, యాదవ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బోట్టా అప్పారావు, నాయకులు కొండలరావు, అప్పారావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది

మాకవరపాలెం: గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి కోరారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ఆదివారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను పంచాయతీ అధికారులు అందజేసిన బుట్టల్లోనే వేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా విధిస్తామన్నారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తారన్నారు. ఈ చెత్త ద్వారా ఎరువును తయారు చేసి వచ్చే ఆదాయాన్ని గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలన్నారు. పాలిథిన్ కావర్లు, గ్లాసులను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న గ్రామ పెద్దలు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

దేవరాపల్లి: స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాశీపురం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. ఈ టెస్ట్‌కు దేవరాపల్లి, చోడవరం, పెందుర్తి మండలాల నుంచి టెన్త్ విద్యార్థులు హాజరయ్యారు. దారపురెడ్డి చరిష్మ 96 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. కైరశీ స్కూల్ విద్యార్థులు జి.లలితకుమార్ 70, సునీత 65, బి.హర్షిత 64 మార్కులతో ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలు సాధించారు. ఐదు నుంచి తొమ్మిది స్థానాల్లో జన్నవరానికి చెందిన ఎస్. బింధుమాధవి, తెనుగుపూడి హైస్కూల్ విద్యార్థి పి.రోహిత్, జన్నవరం విద్యార్థిని ఎం. ద్రాక్షాయిని కాశీపురం విద్యార్థులు బి.వరలక్ష్మి, సిహెచ్. వినయ్‌కుమార్ నిలిచారు. వీరికి సర్పంచ్ ఎ.వరలక్ష్మి, ఉప సర్పంచ్ ఎ. సింహాచలంనాయుడు, ఉపాధ్యాయుడు కె. రాంబాబు జ్ఞాపికలు, పరీక్ష మెటీరియల్ అందజేశారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు



తోడ పెద్దు సేవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



చౌడువాడలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో సేవాగరిడి, ప్రార్థన చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: చౌడువాడలో ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాల వారు మూడు రోజులుగా నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మహా శివరాత్రి సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. సింహాద్రిఅప్పన్న ప్రతిరూపంగా ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాలు వారు భావించే తోడపెద్దును గ్రామంలో భజనా కార్యక్రమాలతో ఘనంగా ఊరేగింపు చేశారు. ఇందులో భాగంగా పాలు కొలుపు, ప్రార్థన, సేవా గరిడీ సేవతో పాటు సింహాద్రి అప్పన్నస్వామి భక్తి గీతాలను ఆలపించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులతోపాటు సమీప గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. చివరి రోజు సింహాద్రప్పన్న మందిరంలో జెడ్పీటీసీ ఈర్లె అనురాధ ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, చల్లా సురేష్ పాల్గొన్నారు.



సింహాద్రప్పన్న ఆలయంలో పూజలను చేస్తున్న జెడ్పీటీసీ అనురాధ

బొజ్జన్నకొండ కళకళ

తుమ్మపాల: శంకరం వద్ద బొజ్జన్నకొండ ఆదివారం జిల్లా, రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో కళకళలాడింది. మెట్ల మార్గం మీదుగా కొండపైకి చేరుకుని రాతి గుహల్లోని బౌద్ధ స్థూపాన్ని దర్శించుకున్నారు. గుహల్లోని ప్రాచీన కట్టడాలను, అద్భుతమైన ఆర్కిటెక్చర్ శిల్పాలను తమ కెమెరాల్లో బంధించారు.